RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్
దినపత్రిక

వరంగల్
సంపుటి : 4, సంచిక : 17

శుక్రవారం
డిసెంబర్ 19, 2025

పేజీలు : 6
వెల : రూ.3-00



4లో..

## ప్రజాపాలనకే పట్టం కట్టారు

# పల్లెల్లో చిచ్చు!

## ఎన్నికలు ముగిసినా ఆగని రాజకీయ పోరు


- ☐ లెక్కింపు కేంద్రాల నుంచే మొదలైన వివాదాల మంట
- ☐ కౌంటింగ్ గొడవలు ఊర్ల వరకు..
- ☐ కొత్తవారిని లాక్కునేందుకు పార్టీల ప్రయత్నాలు
- ☐ నిధుల ఆశ చూపడంతో పెరిగిన రాజకీయ పోటీ
- ☐ పార్టీల పోరులో నలిగిపోతున్న గ్రామ నేతలు
- ☐ హస్తం, కారు పార్టీల మధ్య చీలిపోయిన పల్లెలు
- ☐ శాంతి కరువై, ఘర్షణల వైపు మళ్లుతున్న పల్లె జీవితం


**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి :**

స్థానిక ఎన్నికలు ముగిశాయి. ఫలితాలు వచ్చాయి. ప్రజాప్రతినిధులు ఎన్నికయ్యారు. కానీ ఎన్నికలతోనే ముగియాల్సిన రాజకీయ పోరు మాత్రం ఆగలేదు. ఇప్పుడు పల్లెల్లో రాజకీయం కొత్త రూపం దాల్చింది. పచ్చని పల్లెల్లో ప్రశాంతత కనిపించాల్సిన వేళ.. రాజకీయ చిచ్చు రగులుతోంది. ఓటింగ్ కేంద్రాల వద్ద ముగిసిన పోటీ, ఇప్పుడు గ్రామాల వీధుల్లోకి, గడపల్లోకి చేరింది. రాష్ట్రంలోని పలు గ్రామాల్లో గెలుపు, ఓటమి ఆనందంగా కాకుండా ప్రతీకారంగా మారింది. కొన్నిచోట్ల గెలిచినవారు ఓడినవారిపై దాడులకు దిగుతుంటే, మరికొన్ని చోట్ల ఓడినవారు తట్టుకోలేక గెలిచినవారిపై దాడులు చేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఎన్నికల తర్వాత గ్రామాల్లో ఉండాల్సిన ఐక్యతకు బదులు, రెండు వర్గాల మధ్య విభేదాలు తీవ్ర స్థాయికి చేరుతున్నాయి. ఈ పరిస్థితికి రాజకీయ పార్టీల మధ్య జరుగుతున్న పోటీ కూడా ప్రధాన కారణంగా మారుతోంది.

**– లెక్కింపు కేంద్రాల వద్ద మొదలై..**

ఎన్నికల లెక్కింపుల దశ నుంచే చాలా చోట్ల వివాదాలు మొదలయ్యాయి. ఓట్లు ఎక్కువగా వచ్చాయా, తక్కువగా వచ్చాయా అన్న అనుమానాలు.., కౌంటింగ్ సరిగా జరగలేదన్న ఆరోపణలు, బ్యాలెట్‌లు గందరగోళంగా లెక్కించారన్న విమర్శలు వినిపించాయి. మరికొన్ని చోట్ల ఓట్లు బయట పడేశారని, ఉద్దేశపూర్వకంగా లెక్కింపులో తేడాలు చేశారన్న ఆరోపణలతో అభ్యర్థులు, వారి మద్దతుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మొదలైన ఈ గొడవలు, ఆ తర్వాత గ్రామాల వరకూ విస్తరించాయి. లెక్కింపులపై ఉన్న అనుమానాలే గెలుపు–ఓటమి వివాదాలను మరింత ముదిర్చి, చివరకు పల్లెల్లో రాజకీయ ఉద్రిక్తతలకు, ఘర్షణలకు దారి తీస్తున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.






**– కొత్తవారిని తమ పార్టీలో చేరాలంటూ**

ప్రత్యేకంగా బీఆర్ఎస్ నుంచి, స్వతంత్రులుగా గెలిచిన ప్రజాప్రతినిధులను తమ వైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్

మిగతా 3వ పేజీలో..

## జిల్లా పరిషత్ ఎన్నికలకు
# సిద్ధం కావాలి

- రాబోయే విజయాలకు భువనగిరి గడ్డ పునాది వేసింది
- పూర్వ వైభవానికి నిదర్శనం సర్పంచుల గెలుపు
- కాంగ్రెస్ నేతల దాడులను ఖండించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెండ్ కేటీఆర్
- యాదాద్రి భువనగిరిలో బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశం

**వేద న్యూస్, యాదాద్రి భువనగిరి:**



రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామా రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ పునర్వైభవానికి ఇదే ఆరంభమని, భవిష్యత్తులో సాధించబోయే అఖండ విజయాలకు యాదాద్రి భువనగిరి జిల్లా గడ్డ పునాది వేసిందని కేటీఆర్ స్పష్టం చేశారు.సర్పంచ్ ఎన్నికల ఫలితాలు పార్టీ శ్రేణులకు నూతనోత్సాహాన్ని ఇచ్చాయని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఎదురైన పరాజయాన్ని ప్రజలు సరిదిద్దుతున్నారని వ్యాఖ్యానించారు. భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల్లో కలిపి జిల్లావ్యాప్తంగా 161 మంది సర్పంచులను గెలిపించుకోవడం చిన్న విషయం కాదని కొనియాడారు. ఈ విజయం

మిగతా 3వ పేజీలో..

## కేంద్రానికి వ్యతిరేకంగా
# కాంగ్రెస్ భారీ నిరసన ర్యాలీ

- బీజేపీ కార్యాలయం ఎదుట హస్తం శ్రేణుల ధర్నా
- పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

బీజేపీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించేందుకు గురువారం గాంధీ భవన్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీగా తీశాయి. కేంద్ర ప్రభుత్వ విధానాలకు

మిగతా 4వ పేజీలో..



## 'హెచ్‌డీ హబ్ 'తోనే ఐబొమ్మ బిజినెస్!

- ప్రత్యేక టెలిగ్రామ్ ఛానల్ ద్వారా పైరసీ ప్రింట్ల అమ్మకం
- శాటిలైట్ లింక్, క్యూబ్ నెట్‌వర్క్ హ్యాకింగ్‌తో హెచ్‌డీ కంటెంట్
- విచారణలో ఐబొమ్మ రవి సంచలన నిజాలు
- నాంపల్లి కోర్టు 12 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి

4లో..

## ఏపీ సీఎం చంద్రబాబుకు
# బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు



- దార్శనిక నాయకత్వానికి అంతర్జాతీయ గుర్తింపు
- రాష్ట్రానికే గర్వకారణం అన్న డిప్యూటీ సీఎం
- ముఖ్యమంత్రికి పవన్ కల్యాణ్ అభినందనలు
- 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యానికి బలమైన పునాది


**వేద న్యూస్, అమరావతి ప్రతినిధి:**

ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ది ఎకనామిక్ టైమ్స్' అందించే ప్రతిష్ఠాత్మక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది

మిగతా 4వ పేజీలో..

# ముక్కోటికి భద్రాద్రి ముస్తాబు

- గోదావరి తీరంలో ఆధ్యాత్మిక శోభ
- రేపటి నుంచి పగల్పత్తు ప్రయుక్త అధ్యయనోత్సవాలు
- పంచరంగులు, హంసవాహన సేవలతో భద్రాచలం కళకళ
- 29న తెప్పోత్సవం.. 30న వైకుంఠ ద్వార దర్శనం
- ఆన్లైన్‌లో టికెట్ల విక్రయం.. ఇంకా అందుబాటులో కొన్ని స్లాట్లు
- మన రాష్ట్రంతో పాటు పక్కరాష్ట్రాల నుంచీ భక్తుల భారీ రాక
- తెప్పోత్సవానికి ఏర్పాట్లు.. గోదావరి తీరంలో ప్రత్యేక భద్రత



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

భద్రాచలం మరోసారి భక్తుల జయజయ ధ్వానాలతో మార్మోగేందుకు సిద్ధమవుతోంది. శ్రీరామనామ స్మరణతో, గోదావరి తీరంలో ఆధ్యాత్మిక వెలుగులతో భద్రాద్రి పట్టణం ముస్తాబవుతోంది. ప్రతి సంవత్సరం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచే ముక్కోటి ఏకాదశి జనవరి 10వ తేదీ, శుక్రవారం జరగనుండగా, దానికి అనుబంధంగా నిర్వహించే పగల్పత్తు ప్రయుక్త అధ్యయనోత్సవాలు రేపటి నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామివారి వివిధ అవతారాల దర్శనాలు, ప్రత్యేక సేవలు, ఉత్సవ మూర్తుల అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకోనున్నాయి. ఆలయ ప్రాంగణంతో పాటు భద్రాచలం పట్టణమంతా పండుగ కళను సంతరించుకుంది. ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద స్వాగత ద్వారాలు, రంగురంగుల లైట్లు, పుష్పాల అలంకరణలు ఏర్పాటు చేసి భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పగల్పత్తు ఉత్సవాల్లో భాగంగా జరిగే పంచరంగుల సేవ, హంసవాహన సేవ ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. బ్రిడ్జి రోడ్డు సెంటర్‌లో ప్రధాన స్వాగత ద్వారం, అభయాంజనేయస్వామి సెంటర్, సూపర్ మార్కెట్ సెంటర్‌తో పాటు ఇతర కూడళ్లలోనూ ఆకర్షణీయమైన ద్వారాలు సిద్ధమయ్యాయి. భక్తులు అడుగుపెట్టిన ప్రతి చోటా ఉత్సవ శోభ కనువిందు చేయనుంది.

**– గోదావరిలో తెప్పోత్సవం..**

మిగతా 3వ పేజీలో..

వేద న్యూస్

శుక్రవారం డిసెంబర్ 19, 2025

# ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

- సమన్వయంతో పనిచేసిన అధికారులకు అభినందనలు..
- మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు



**వేద న్యూస్, మెదక్:**

గ్రామపంచాయతీ ఎన్నికలు అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగిశాయని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి నేటి వరకు మూడు విడతలుగా జరిగిన ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రజలు, పోలీసు అధికారులు, ఇతర శాఖల సిబ్బందికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు మొత్తం 750 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల తేదీలు ఖరారైన నాటి నుంచే జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నిబంధనలను కఠినంగా అమలు చేయడం జరిగిందని చెప్పారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు, భయభ్రాంతులకు గురికాకుండా నిరంతర నిఘా కొనసాగించామని వివరించారు. జిల్లాలో విస్తృత తనిఖీలు చేపట్టడం ద్వారా నేటి వరకు రూ.47 లక్షల 48 వేల నగదు, 268 కేసుల్లో సుమారు రూ.26 లక్షల 46 వేల 968 రూపాయల విలువగల 3,688 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా రూ.27 లక్షల 36 వేల విలువగల 673 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, స్వాధీనం చేసుకున్నా మొత్తం విలువ రూ. కోటి 1లక్ష 32 వేలు ఉంటుందని తెలిపారు. గత ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానస్పద వ్యక్తులను గుర్తించి ముందస్తుగా 1,122 మందిని బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు సిబ్బంది చలి, పగలు, రాత్రి లెక్కచేయకుండా విధులు నిర్వహించారని, ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడి పనిచేశారని ఎస్పీ ప్రశంసించారు. ఎన్నికలు ఇంత ప్రశాంతంగా జరగడంలో కీలక పాత్ర పోషించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు

# పల్లెల్లో గులాబీ ప్రభం'జనం'

- గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ శక్తి ప్రదర్శన
- అధికార పక్షానికి స్పష్టమైన హెచ్చరిక
- బీఆర్ఎస్ నాయకుడు నరేష్

**వేద న్యూస్, వరంగల్:**



తెలంగాణ రాజకీయాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు మరోసారి కీలక సందేశాన్ని ఇచ్చాయనీ బీఆర్ఎస్ నాయకుడు, కేటీ ఆర్ సేన వరంగల్ జిల్లా అధ్యక్షుడు నరేష్ మైనాల పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. "బీఆర్ఎస్ కాలం ముగిసింది%ౌ% కేసీఆర్ ప్రభావం తగ్గింది ..అనే ప్రచారానికి పల్లెల నుంచే ప్రజలు గట్టి కౌంటర్ ఇచ్చారు. అధికార బలం, పరిపాలనా ఒత్తిళ్లు, డబ్బు ప్రభావం ఉన్నా కూడాగ్రామాల గుండెల్లో గులాబీ జెండా ఇంకా ఎగురుతూనే ఉందని ఈ ఎన్నికలు నిరూపించాయి. అధికారం లేకున్నా ప్రజల అండ అధికారంలో లేని పరిస్థితుల్లో్లనూ బీఆర్ఎస్ అభ్యర్థులకు వచ్చిన మద్దతు సాధారణం కాదు. ఇది కేవలం స్థానిక నాయకుల విజయంగా చూడలేంబీ కేసీఆర్ నాయకత్వంపై గ్రామీణ ప్రజల్లో ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనం. రైతు, కూలీ, మహిళ, యువతుప్రతి వర్గం ఓటు బీఆర్ఎస్ వైపే మొగ్గు చూపింది." అని వెల్లడించారు. "ఎన్నికల్లో డబ్బు, అధికార దర్పం ఎంతవరకు పనిచేస్తాయో ఈ ఫలితాలు ప్రశ్నించాయి. ప్రజలు తమ అనుభవాన్ని, తమ జీవితాల్లో జరిగిన మార్పును ఆధారంగా చేసుకుని ఓటేశారు. అందుకే అధికార పక్షానికి ఊహించని స్థాయిలో ఫలితాలు షాక్ ఇచ్చాయి." అని చెప్పారు."కేసీఆర్ .. ఒక పేరు కాదు, ఒక విశ్వాసం..కేసీఆర్ అంటే కేవలం మాజీ ముఖ్యమంత్రి మాత్రమే కాదుబీ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక. రాష్ట్రాన్ని కొత్త దిశలో నడిపించిన నాయకుడిగా గ్రామీణ ప్రజల మనసుల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. కేసీఆర్ పని అయిపోయింది అన్న వాదనలకు ఈ ఎన్నికలు స్పష్టమైన సమాధానం చెప్పాయి." అని స్పష్టం చేశారు.ఇది కేవలం ఒక ఎన్నిక ఫలితం కాదనీ, ఇది ప్రజల తీర్పు అని, ఇది గులాబీ గర్జన అని పేర్కొన్నారు.

# మహిళా లెక్చరర్‌తో అసభ్య ప్రవర్తన

- ఆకతాయికి దేహశుద్ధి
- రంగప్రవేశం చేసిన పోలీసులు



**వేద న్యూస్, గద్వాల:**

గద్వాల పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న మహిళా లెక్చరర్‌ను వేధిస్తున్న ఓ ఆకతాయికి ఆమె బంధువులు దేహశుద్ధి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే మల్దకల్ మండలం పెద్దొడ్డి గ్రామానికి చెందిన ఓ యువకుడు గత మూడు రోజులుగా సదరు లెక్చరర్‌ను వేధిస్తున్నట్లు సమాచారం. ఆమె కళాశాలకు వెళ్తున్న సమయంలో వెంటపడటం, ఫోన్ నంబర్ ఇవ్వాలని వేధించడం, బైక్‌పై డ్రాప్ చేస్తానంటూ అసభ్యంగా ప్రవర్తించడం వంటి చేష్టలకు పాల్పడ్డాడు. సదరు యువకుడి వేధింపులు భరించలేక బాధితురాలు ఈ విషయాన్ని తన సన్నిహితులకు, బంధువులకు వివరించింది. యువకుడి తీరును ప్రశ్నించేందుకు విద్యాసంస్థల చైర్మన్ సమక్షంలో అతడిని కళాశాలకు పిలిపించారు. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన మహిళా లెక్చరర్ బంధువులు సదరు యువకుడిపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ తోపులాటలో కళాశాలలోని ఫర్నిచర్ పాక్షికంగా ధ్వంసమైంది. గొడవ పెద్దది కావడంతో విద్యాసంస్థల చైర్మన్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

**పోలీసుల ఎంట్రీ.. రాజీ ప్రయత్నాలు..**

ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చి, సదరు ఆకతాయిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ వ్యవహారం పోలీస్ స్టేషన్ వరకు వెళ్తే మహిళా లెక్చరర్ భవిష్యత్తుకు ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో కొందరు పెద్దమనుషులు మధ్యవర్తిత్వం వహించినట్లు తెలుస్తోంది. 'కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది' అన్న చందంగా, విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చి, కేసు నమోదు కాకుండా జాగ్రత్త పడినట్లు సమాచారం. ఆకతాయికి గట్టిగా హెచ్చరికలు జారీ చేసి, రాజీపత్రం రాయించుకుని వదిలేసినట్లు సమాచారం.

# కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

**వేద న్యూస్, అల్లాదుర్గం:**

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని ముస్లాపూర్ గ్రామ శివారులో ఓ గుర్తు తెలియని మగ వ్యక్తి శవం కుళ్లిన స్థితిలో లభ్యమైంది. పావురాల గుట్ట వద్ద ఓ చెట్టుకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. సుమారు 15 రోజుల క్రితమే ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఎవరు.దానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ఢీ...



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని జేఎన్ సి కాలనీలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ఉదయం రెండు కార్లు ఢీ కొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ని నుండి బోధన్ వైపుకు వెళ్తున్న ఎర్టికా కారు, బోధన్ నుండి వర్ని వైపుకు వస్తున్న షిఫ్ట్ డిజైర్.. రెండు కార్లు ప్రమాదవశత్తు పరస్పరం ఢీ కొన్నాయి. ఈ రోడ్డు ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.

# సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అనవసర లింకులను ఓపెన్ చేయకండి
- ట్రేడింగ్ యాప్ ల పట్ల జాగ్రత్త అవసరం
- మెదక్ ఎస్పీ డి.వి శ్రీనివాస రావు




**వేద న్యూస్, మెదక్ ప్రతినిధి:**

ఆకర్షణీయమైన ప్రకటనలు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని నమ్మబలుకుతూ సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రారంభమైన "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా, సైబర్ నేరాలపై రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోస్టర్ల ద్వారా జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు తదితర రద్దీ ప్రాంతాల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా రూపొందించిన సైబర్ నేరాల పోస్టర్లు ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్, బస్సు స్టాండ్ లలో, మార్కెట్లలో వంటి ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రధానంగా డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు మరింత జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. అదేవిధంగా నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్లు, వెబ్‌సైట్లు రూపొందించి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని చెప్పుతూ వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇమెయిల్‌ల ద్వారా లింకులు పంపి మోసపూరిత వాగ్దానాలతో డబ్బులు బదిలీ చేయించుకుని మోసం చేస్తున్న ఘటనల పై పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఇలాంటి మోసపూరిత ఆఫర్లను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, అనుమానాస్పద కాల్స్ లేదా లింకులు ఎదురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని, లేక సంబంధిత పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్ మహేందర్, సైబర్ క్రైమ్ డియస్పి సుభాష్ చంద్ర బోస్, ఆర్ ఐ శైలందర్, ఆర్ ఎసై నరేష్, సైబర్ క్రైమ్ సిబ్బంది సయ్యద్, సాయికిరణ్ పాల్గొన్నారు.

## జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాస రావు



**వేద న్యూస్, మెదక్:**

21వ తేదీ జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీ డీవీ శ్రీనివాస రావు కోరారు. జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా త్వరితగతిన, తక్కువ ఖర్చుతో, ఇరువైపుల సమ్మతితో సమస్యలను పరిష్కరించుకునే అవకాశం అందుబాటులో ఉందని తెలిపారు. రాజీ చేసుకునే అవకాశమున్న వివిధ రకాల కేసులు, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితం, కుటుంబ సమస్యలకు సంబంధించిన కేసులు, డ్రంకన్ డ్రైవ్, మోటారు వాహన చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం తదితర కేసులు అని వివరించారు. చిన్నచిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోవద్దని, రాజీ అంటే విజయం వైపు దారితీసే నిజమైన మార్గమాని పేర్కొన్నారు. న్యాయశాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**వేద న్యూస్, చొప్పదండి:**



- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి అర్హులకు అందించాలని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని వెదురుగట్టు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా ఎన్నికైన పెంచాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ మారం సమత శ్రీనివాస్, వార్డు సభ్యులు అందరూ కలిసి ఎంఎల్ఏని మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని శాలువా కప్పి సత్కరించారు. అనంతరం సర్పంచ్, ఉప సర్పంచ్ గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా అభివృద్ధి విషయంలో అండగా ఉంటామని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటి రెడ్డి పద్మాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమండ్ల గంగయ్య, మాజీ పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి గౌడ్, మునిగల సుధాకర్, నేరుమట్ల మల్లేశం మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిలుక సంజీవ్ గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆఫీస్ ఎదుట కాంగ్రెస్ నాయకులు ధర్నా

**వేద న్యూస్, రుద్రూర్:**



నేషనల్ హెరాల్డ్ కేసులో గత పదేళ్లుగా ఏఐసిసి అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని బీజేపీ ప్రభుత్వం వేదిస్తున్న సందర్భంలో కోర్టు ఈడి కేసులను తప్పుబట్టిన నేప థ్యంలో, బీజేపీ అరాచకాలను నిలదీస్తూ గురువారం కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఇందులో భాగంగా ధర్నా చేసిన కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి నిజామాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కట్పల్లి నగేష్ రెడ్డి, నిజామాబాద్ టౌన్ ప్రెసిడెంట్ బొబ్బిలి రామకృష్ణ, బాన్సువాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్, అన్ని మండలాల నాయకులు పాల్గొన్నారు.

# యాసంగికి సాగునీరు అందించాలి



**– బీఆర్ఎస్ మెదక్ జిల్లా కార్యదర్శి నాయికోటి భాస్కర్**
**– టేక్మల్ తహసీల్దార్ కు వినతిపత్రం అందజేత**

**వేద న్యూస్, టేక్మాల్ ప్రతినిధి:**

ఈ యాసంగిలో వరి పంట సాగు చేయడానికి చెరువుల కింద ఉన్న ఆయకట్టుకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ మెదక్ జిల్లా కార్యదర్శి నాయికోటి భాస్కర్ డిమాండ్ చేశారు. స్థానిక రైతులతో కలిసి టేక్మాల్ తహసీల్ధార్ తులసీరామ్ కు వినతి పత్రం అందజేశారు. టేక్మాల్ పరిధిలోని పెద్ద చెరువు, చిన్న చెరువు, పంతులు చెరువు, కుడి చెరువుల్లో నిండుగా నీళ్లు ఉన్నాయని, ఆయా చెరువుల పరిధి ఆయకట్టు భూములలో వరి సాగు చేసుకోవడానికి తైబంద్ విధించాలని కోరారు. వరి పంట సాగుకు తుకాలు వేసుకునే సమయం కూడా తగ్గర పడుతోందని, ఇప్పటి వరకు తైబందు పెట్టకపోవడం వల్ల రైతులు ఆయోమయ పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. గ్రామంలో ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, చెరువుల్లో పుష్కలంగా నీళ్లు ఉన్నప్పటికిని వ్యవసాయానికి సాగు నీరు అందించకపోతే రైతులు వలస వెళ్లే దుస్థితి నెలకొంటుందని తెలిపారు రైతుల శ్రేయస్సు, వారి జీవనోపాధి కోసం తైబందు పెట్టి వ్యవసాయానికి సాగు నీరు అందించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించి తహసీల్ధార్ ఇరిగేషన్ అధికారుల తో సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు సంజీవులు, శివరాజ్, జోగయ్య, రాకేష్, లింగం, భూమయ్య, సాయి బాబా, ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.

# కీర్తి రెడ్డిని కలిసిన బీజేపీ నేతలు

**వేద న్యూస్, శాయంపేట:**



పార్టీ కోసం పని చేస్తున్న ప్రతి కార్యకర్తకు మంచి భవిష్యత్తు ఉంటుందని బీజేపీ భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జి చందుపట్ల కీర్తి రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో శాయం పేట మండలం మైలారం గ్రామ సర్పంచ్ గా గెలిచిన నూనె దివ్య తిరుపతి గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జి చందుపట్ల కీర్తి రెడ్డిని, జిల్లా అధ్యక్షుడు నిషిధర్ రెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ను కీర్తిరెడ్డి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ, నూనె ప్రకాష్ పాల్గొన్నారు.

## మేకల సంఘం మార్కెట్ అధ్యక్షుడిగా కళ్యాణ్ ఎన్నిక

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల మేకల సంఘం మార్కెట్ అధ్యక్షులుగా కళ్యాణ్ ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శామీర్, ఇమ్రాన్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తూర్పు అభివృద్దే ప్రధాన లక్ష్యం

**– రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

నియోజక వర్గ అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గురువారం వరంగల్ (తూర్పు) నియోజక వర్గ పరిధిలో గల 38, 39 డివిజన్లలో రూ.2 కోట్ల 68 లక్షల అంచనా వ్యయం తో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 38వ డివిజన్లో సిసి రోడ్లు డ్రైన్లలకు శంకుస్థాపనతో పాటు కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించుకోవడం నిర్వహించుకోవడం తో పాటు ఖిలా వరంగల్ ఈద్గా కు కోటి రూపాయలు మంజూరు చేసి మరమత్తులు చేపట్టి ఒక ఆకారానికి (రూపానికి) తీసుకురావడానికి తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే కోరడం జరిగిందని అన్నారు. ఈ ప్రాంతంలో నీరు శాశ్వతంగా నిలిచి ఉండడం వల్ల మొత్తం ఫ్లోరింగ్ చేపట్టి సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు చేపడతామని 37వ డివిజన్ ఎంఎం నగర్ లో లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన నేపథ్యంలో నిర్మించుకున్న ఇల్లు ప్రారంభోత్సవానికి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు ఆ ఇంటిని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు సాధారణ గృహాల మాదిరిగా చాలా చక్కగా నిర్మించారని ఇల్లు కాస్త విశాలంగా ఉండాలని భావించి ఇంటి యజమానులు కొన్ని డబ్బులు వెచ్చించి నిర్మించుకున్నారని ఇళ్లు చక్కగా నిర్మించారని,నిర్మాణం కొనసాగుతున్న ఇళ్లను కూడా సందర్శించడం జరిగిందని ఇళ్లు నిర్మాణం చేసేది ఒక్కసారే నని అట్టి ఇల్లు సౌకర్యవంతం గా ఉండేలా కట్టుకోవడం జరుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన పేరిట దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారికి ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు. అదే క్రమంలో వరంగల్ (తూర్పు) నియోజకవర్గానికి కేటాయించిన 3500 ఇళ్ళలో అర్హులైన చాలామంది లబ్ధిదారులకు ఇవ్వడం జరిగిందని ఇందిరమ్మ ఇళ్ల కోసం చాలా దరఖాస్తులు వస్తున్నాయని ఎల్ 1 లో ఉన్న వారికి మంజూరు ఇస్తామని ఎల్ 2 లో ఉన్నవాళ్ళు స్థలం లేని వాళ్ళు నిరుపేదలు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పటికే నిర్మించబడి ఉన్నాయని ఇళ్లను కేటాయించిన తర్వాత వాటికి మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, డిఆర్ఓ విజయ లక్ష్మీ, కార్పొరేటర్ లు బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, భోగి సువర్ణ సురేష్, బస్వరాజు కుమార స్వామి, కావేటి కవిత, ఎస్ఈ సత్యనారాయణ, ఏసిపి శుభమ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి బియ్యం వితరణ

**వేద న్యూస్, కమలాపూర్:**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన పొట్టకారి లచ్చమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందగా, ఇటీవల పంచాయతీ ఎన్నికల్లో అదే వార్డుకు సంబంధించి 4వ వార్డ్ మెంబర్గా ఎన్నికైన కన్నూరి శృతి వేణు ఆ కుటుంబాన్ని పరామర్శించి తమ సానుభూతిని ప్రకటించారు. తమ వంతుగా 25 కిలోల బియ్యం సాయంగా అందజేశారు. వార్డ్ మెంబర్ గా ఎన్నికైన కొద్ది రోజుల్లోనే తమ వార్డుకు సంబంధించి ఓ కుటుంబానికి కష్టం వచ్చిందని వెంటనే స్పందించి ఆ కుటుంబానికి ఎంతో కొంత సాయం అందించడం నిజంగా గొప్ప విషయమని వార్డు ప్రజలు పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి ప్రశాంత్, జక్కు శ్రీనివాస్, పత్తిపాక రమేష్, కొండ వేణు, రంగు రమేష్, బండి అఖిల్, అబ్బనవేని రాజయ్య, గుండ సమ్మయ్య, గాలిబ్ రాజమౌళి, బుర్రి రాజేందర్ తదితరులు ఉన్నారు.

# పల్లెల్లో చిచ్చు!
## ఎన్నికలు ముగిసినా ఆగని రాజకీయ పోరు

ప్రయత్నాలు చేస్తోందన్న ప్రచారం గ్రామస్థాయిలో కలకలం రేపుతోంది. ఇప్పటి వరకు పార్టీ కోసం నిలబడి పనిచేసిన వారిని పక్కన పెట్టి, కొత్తగా గెలిచిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారన్న భావనతో కేడర్లో అసంతృప్తి పెరుగుతోంది. గ్రామాల్లో రాజకీయాలు కొత్త మలుపు తిరుగుతున్నాయి. ఎన్నికల ముందు వరకు పార్టీలకు విధేయంగా ఉన్న వారు.. ఇప్పుడు పరిస్థితులు చూసి తాము ఎటు వైపు ఉండాలన్న ఆలోచనలో పడుతున్నారు. ఈ సందిగ్ధతే గ్రామాల్లో రాజకీయ ఉద్రిక్తతలకు దారితీస్తోంది.

**– నిధుల ఆశచూపి..**

గెలిచిన వారిని తమవారిగా చెప్పుకునేందుకు కాంగ్రెస్ నిధుల ఆశ చూపుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార అండ, అభివృద్ధి నిధులు, ప్రభుత్వ సహకారం పేర్లతో వారిని మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న మాటలు గ్రామాల్లో బహిరంగంగానే చర్చకు వస్తున్నాయి. బీఆర్ఎస్ కూడా తమ నుంచి గెలిచిన వారిని కాపాడుకునేందుకు పలువిధాల ప్రయత్నాలు చేస్తోంది. పార్టీని వీడకుండా నిలబెట్టే ప్రయత్నాల్లో రెండు పార్టీలు కొత్తవారిని తమవారిగా చెప్పుకునేందుకు నానా యత్నాలు చేస్తున్న పరిస్థితి నెలకొంది.

**– నలిగిపోతున్న గ్రామస్థాయి నాయకులు**

అయితే పార్టీలు ఆడుతున్న రాజకీయ పోటీలో నలిగిపోతున్నది మాత్రం గ్రామస్థాయి నాయకులే. లక్షలు ఖర్చు చేసి ఎన్నికల్లో నిలబడ్డాం.. గెలవలేకపోయిన బాధ ఒకటైతే, నమ్ముకున్న పార్టీనే తమ ప్రత్యర్థులను పార్టీలోకి చేర్చుకోవడం ఇంకో పెద్ద అవమానంగా మారిందని.. చాలా చోట్ల ఓడిన అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేశాం.. పోరాటాల్లో నిలబడ్డాం.. కానీ ఫలితాల తర్వాత మాత్రం మాకు విలువ లేకుండా పోయిందన్న భావన గ్రామస్థాయి నేతల్లో తీవ్ర అసంతృప్తికి దారి తీస్తోంది. ఈ ఆవేదనే కొన్ని చోట్ల ఉద్రిక్తతలకు, మరికొన్ని చోట్ల ఘర్షణలకు కారణమవుతోంది.

**– రెండు పార్టీలుగా పల్లెలు**

మొత్తంగా చూస్తే రాష్ట్రంలోని పల్లెల్లో ఇప్పుడు రాజకీయ పోరు స్పష్టంగా రెండు రంగులుగా మారింది. హస్తం వర్సెస్ కారు అన్న చందంగా గ్రామాలు రెండు వర్గాలుగా చీలిపోతున్నాయి. ఎన్నికల ఫలితాల కంటే, ఫలితాల తర్వాత జరుగుతున్న రాజకీయ పరిణామాలే పల్లెల్లో శాంతి భద్రతలకు సవాల్గా మారుతున్నాయి. స్థానిక ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది కావాల్సిన వేళ.. అవి గ్రామాల్లో చిచ్చుకు కారణమవుతుండటం ఇప్పుడు అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది.

**– కొన్ని ఘటనలు..**

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం, సోమార్పేటలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు పొందిన అభ్యర్థి విజయం సాధించాడు. గెలుస్తాడనుకున్న అనుకున్న అభ్యర్థి ఓటమి పొందడంతో ఆవర్గానికి అసంతృప్తి వ్యక్తమైంది. ఓటమికి గురైన అభ్యర్థి, వారి వర్గంపై గెలిచిన అభ్యర్థి తమ్ముడు తీవ్ర ఆగ్రహంతో దాడికి దిగాడు. ట్రాక్టర్తో ఓడిన అభ్యర్థి ఇంటిని ధ్వంసం చేశాడు. ఈ దాడిలో ఐదుగురికి గాయాలయ్యాయి. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**– సూర్యపేట లో ఘర్షణ.. బీఆర్ఎస్ కార్యకర్త మృతి**

సూర్యపేట్ జిల్లాలో బీఎఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకొంది.. ఇరు పార్టీల ఘర్ణణలో అనేక మందికి గాయాలయ్యాయి.

– ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురంలో పంచాయతీ ఎన్నికల రెండో దశ ఫలితాల అనంతరంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య మొదలైన మాటల యుద్ధం, ఘర్షణగా మారి, చివరకు రాళ్లు, కర్రలతో కొట్టుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి.

– వరంగల్ జిల్లా చెన్నరాయపేట మండలం చెరువు కొమ్మ తండాలో సర్పంచ్ ఎన్నికల ఫలితంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య వాగ్వాదం ఉద్రిక్తంగా మారి ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాల కార్యకర్తలు ఘర్షణకు దిగారు. పోలీసులు ఇరు పక్షాలను చెదరగొట్టి శాంతిపజేశారు.

# ముక్కోటికి భద్రాద్రి ముస్తాబు



ముక్కోటి సందర్భంగా భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే గోదావరి తెప్పోత్సవం ఈనెల 29వ తేదీ రాత్రి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం కోసం వినియోగించే తాత్కాలిక ర్యాంపు నిర్వహణ స్థలాన్ని అధికారులు ఇప్పటికే పరిశీలించి, భద్రతాపరమైన సూచ నలు చేశారు. గోదా వరి తీరంలో అదనపు భద్రతా చర్యలు, లైటింగ్, నిఘా ఏర్పాటు చేస్తున్నారు.

**– 30న ఉత్తరద్వార దర్శనం**

ముక్కోటి ఏకాదశి రోజున భద్రాచలంలో జరిగే ఉత్తరద్వార దర్శనం అత్యంత పవిత్రమైనదిగా భక్తులు భావిస్తారు. ఈ దర్శనం చేస్తే ముక్తి లభిస్తుందన్న నమ్మకంతో లక్షలాది మంది భక్తులు భద్రాచలానికి తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు ప్రత్యేక క్యూలైన్లు, బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తూ, భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**– పక్కరాష్ట్రాల నుంచీ భక్తుల రాక**

ముక్కోటి ఏకాదశి అంటే కేవలం మన రాష్ట్రానికే పరిమితం కాదు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర వంటి పక్కరాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు భద్రాచలానికి తరలివస్తారు. శ్రీరాముడిపై అపారమైన భక్తితో కుటుంబ సమేతంగా, పాదయాత్రలతో, ప్రత్యేక వాహనాల్లో భద్రాచలానికి చేరుకుని ఉత్తరద్వార దర్శనం చేసుకోవడం సంప్రదాయంగా మారింది. ఈ కారణంగా భద్రాచలం ఈ రోజుల్లో రాష్ట్రాల సరిహద్దులను దాటి ఒక మహా ఆధ్యాత్మిక కేంద్రంగా మారుతుంది.

**– ఆన్లైన్లో టికెట్ల విక్రయం**

ఉత్తరద్వార దర్శనం కోసం ఆన్లైన్లో ఇప్పటికే టికెట్ల విక్రయం కొనసాగుతోంది. మొత్తం 719 టికెట్లు విక్రయించగా, ఇంకా కొన్ని టికెట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. భక్తులు అధికారిక వెబ్సైట్ ద్వారా ముందుగానే టికెట్లు కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, వైద్య శిబిరాలు, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పోలీస్ శాఖ, ఆలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముక్కోటి వేడుకలను విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారు.

# జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం కావాలి

రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయం అత్యంత దిగజారిందని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఖండించారు. కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రజలు ఈ పరిణామాలను గమనిస్తున్నారని అన్నారు. అధికారులు కూడా అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించే ప్రయత్నాలపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. రైతుబంధు, పింఛన్లు వంహామీలపై కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. రైతులకు రావాల్సిన సహాయం అందక అల్లాడుతున్న పరిస్థితి నెలకొందని అన్నారు. రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని, పార్టీ బీ-ఫామ్పై జరిగే ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఘన విజయం అందించాలని కార్యకర్తలకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు ఎవరి సొంతం కాదని, అవి ప్రజలకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన హక్కులని స్పష్టం చేశారు.

# ప్రజాపాలనకే పట్టం కట్టారు



- 66శాతం పల్లె ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకే
- మరింత బాధ్యతగా పనిచేస్తాం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అన్ని పార్టీలతో చర్చ
- సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతాం
- ఎన్నికల యంత్రాంగం, అధికారులకు అభినందనలు
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

రాష్ట్రంలో మొత్తం 12,728 గ్రామ పంచాయతీలకు గాను, 12,702 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగగా, ప్రజలు స్వేచ్ఛగా తమ తీర్పును వెల్లడించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన అనంతరం ప్రజల ముందుకు వెళ్లగా, 7,527 గ్రామ పంచాయతీల్లో అంటే సుమారు 66 శాతం ప్రాంతాల్లో ప్రజల మద్దతు లభించిందని తెలిపారు. ఇది ప్రభుత్వంపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అంశంపై శాసనసభ సమావేశాల్లో చర్చించి, అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాల మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా పాలన సాగించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళా సమాఖ్యలకు రూ.27 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు, 4.5 లక్షల మందికి ఇందిరమ్మ ఇండ్లు, తొలి ఏడాదిలోనే 61 వేల ఉద్యోగాల భర్తీ, ఎస్సీ వర్గీకరణకు పరిష్కారం, బీసీ కులగణన వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం క్రమపద్ధతిలో అమలు చేస్తోందని వివరించారు. ఒకవైపు ఆదాయ ం పెంచుకుంటూ, మరోవైపు దుబారాను తగ్గిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరగకుండా ప్రజలకు మేలు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అలాగే కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కుల అంశాన్ని పూర్తి వివరాలతో శాసనసభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతమైన వాతా వరణంలో, పూర్తిగా ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించినందుకు ఎన్నికల యంత్రాంగానికి, అధికారులకు ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, ధనసరి అన సూయ సీతక్కతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# టెట్ వాయిదా వేయండి

- ఎమ్మెల్సీ మల్క కొమరయ్య



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఏడాది జనవరి నెల 3వ తేదీ నుంచి జనవరి 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ ను వాయిదా వేయాలని బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గత ఇరవై రోజులుగా రాష్ట్రంలో జరిగిన పంచాయతీ ఎన్నికల విధుల నిర్వహణలో పాల్గొన్న ఉపాధ్యాయులు ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, సహాయక ప్రిసైడింగ్ అధికారులుగా బాధ్యతను నిర్వర్తించారు. నిరంతరం పనిచేయడం వల్ల టెట్ పరీక్షకు సన్నద్ధమవ్వడానికి తగిన సమయం వారికి లభించలేదు. టెట్ పరీక్షకు సిద్ధమవ్వడానికి వారికి తగినంత సమయం ఇవ్వాలని , అందుకే జనవరి నెలలో జరగనున్న ఈ పరీక్షను వాయిదా వేయాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఐఏఎస్ , పాఠశాల విద్యాశాఖ ఇంచార్జ్ డైరెక్టర్ శ్రీదేవసేన ఐఏఎస్ గార్లకు ఎమ్మెల్సీ మల్క కొమరయ్య లేఖ రాశారు. ఆ లేఖలో పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఉపాధ్యాయులందరూ విరామం లేని పని కారణంగా శారీరక-మానసిక అలసట ఏర్పడి, టెట్ పరీక్షకు సిద్ధమయ్యే వారి సామర్థ్యంపై ప్రభావం పడిందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా టెట్ నిర్వహించడం ఉపాధ్యాయులకు అనవసరమైన ఒత్తిడి, ఇబ్బందిని కలిగించవచ్చని ఆయన ఆ లేఖలో అభిప్రాయపడ్డారు. ఈ కారణంతో ఉపాధ్యాయులు ఎన్నికల విధుల నుంచి కోలుకుని సమర్థవంతంగా సిద్ధమయ్యేందుకు తగిన సమయం ఇవ్వాలని, అందుకు టెట్ పరీక్షను వాయిదా వేసి తదుపరి పరీక్ష షెడ్యూల్ విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిగణించాలని ఆ లేఖలో కోరారు. ఈ విజ్ఞప్తిని ప్రభుత్వం పరిశీలించి, ఉపాధ్యాయుల ప్రయోజనాలు మరియు విద్యా వ్యవస్థ పటిష్టత కోసం తగిన నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ఆ లేఖలో తెలిపారు. ఈ లేఖను స్వీకరించిన విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పాఠశాల విద్యాశాఖ ఇంచార్జ్ డైరెక్టర్ శ్రీదేవసేన ఐఏఎస్ సానుకూలంగా స్పందించి తక్షణమే ఇట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయులకు మేలు చేకూరేలా నిర్ణయం తీసుకునేలా తనవంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

# జీర్ణించుకోలేకే దాడులు

- కాంగ్రెస్ పాలనలో చేయని అవినీతి లేదు
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, డూప్లికేట్ గాంధీ కుటుంబ వారసుల అక్రమాలు బయటపడుతుంటే జీర్ణిం చు కోలేని కాంగ్రెస్ నేతలు మరో సారి ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసేలా రాజ్యాంగాన్ని విస్మరిస్తూ ఇలా బీజేపీ కార్యాలయల వద్దకు వచ్చి దాడులు చేయడన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ అన్నారు. 70 ఏళ్ళు పాలించి, దేశాన్ని పూర్తిగా అవినీతి మయం చేసారు. కాంగ్రెస్ పాలనలో చేయని అవినీతి, అక్రమాలు లేవన్నారు. 1975 ఏమర్జెన్సీ విధించిన పార్టీ కాంగ్రెస్ అని, వాళ్ల అవినీతి బాగోతం బయటపడుతుందనే తట్టుకోలేక ఇలా అప్రజాస్వామిక విధానాలను అవలంభిస్తున్నారని మండిపడ్డారు. మోదీ ప్రధాని అయ్యాక దేశం అభివృద్ధి పథంలో దుసుకుపోవడన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నేతలు ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని ఎదుర్కొన్నవాళ్ళం ఇలాంటి, నిరసనలు, దాడులు చేస్తే తిప్పి కొడతామన్నారు.

# ధర్మసాగర్ ఉప సర్పంచ్‌గా కొమురమ్మ ఎన్నిక


**వేద న్యూస్, ధర్మసాగర్ :**



రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు ధర్మసాగర్ గ్రామ పంచా యతీలో ఉప సర్పంచ్ ఎన్నికను ప్రత్యేక సమావేశం ద్వారా నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్‌తో పాటు మొత్తం 14 మంది వార్డు సభ్యులు హాజరయ్యారు. ఉప సర్పంచ్ పదవికి 11వ వార్డు సభ్యురాలు కొంతం కొమురమ్మ, 1వ వార్డు సభ్యుడు మేకల సాంబరాజు పోటీ పడ్డారు. 13వ వార్డు సభ్యుడు గంగారపు శ్యామ్ కొంతం కొమురమ్మను ఉప సర్పంచ్‌గా ప్రతిపాదించగా, 8 మంది వార్డు సభ్యులు మరియు సర్పంచ్ చేతులు ఎత్తి మద్దతు తెలిపారు. అదేవిధంగా మేకల సాంబరాజును 9వ వార్డు సభ్యుడు బెల్లం ప్రేమ్ కుమార్ ప్రతిపాదించగా, 6మంది వార్డు సభ్యులు మద్దతు ప్రకటించారు. మొత్తం ఓట్ల లెక్కింపులో కొంతం కొమురమ్మకు 9 ఓట్లు రావడంతో ఆమె ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్లు జిల్లా సహాయ ఎన్నికల అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధికారికంగా ప్రకటించారు.

# రుద్రూర్ బీజేపీలో చేరికలు

**వేద న్యూస్, రుద్రూర్:**



ప్రధాని నరేంద్ర మోడీ దేశంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి వలసలు వస్తున్నారు. రుద్రూర్ మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో గురువారం పలు వురు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో డి.సతీష్ గౌడ్, శేర్ల శివకుమార్ గౌడ్, జాకోర లక్ష్మణ్, తెల్ల రవి, కడారి శేఖర్, దక్కే శివకుమార్, పెంట శివకుమార్లు చేరారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్ మండల అధ్యక్షు లు అలపాటి హరికృష్ణ, కోశాధికారి కటిక రామరాజు, మండల ప్రధాన కార్యదర్శి ఏముల గజేందర్, యువమోర్చా అధ్యక్షులు కుమ్మరి గణేష్, మండల సీనియర్ నాయకులు, పార్వతి మురళి, చిదుర మహిపాల్, రాజా వరప్రసాద్, మండల ఉపాధ్యక్షులు బెగరివినోద్ కుమార్, వంజరి శ్రీనివాస్, ధర్మవరం వెంకటేష్, బైండ్ల గంగాధర్, బైండ్ల సంజీవ్, గోపి, మండల సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ భారీ నిరసన ర్యాలీ

వ్యతిరేకంగా ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఈ ర్యాలీలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, యువజన నేతలు, మహిళా విభాగాల ప్రతినిధులు ర్యాలీలో పాల్గొని నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తోందని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా ఆరోపించారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజల గొంతుకగా కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని వారు స్పష్టం చేశారు. ర్యాలీ సందర్భంగా గాంధీ భవన్ పరిసరాలు కాంగ్రెస్ నినాదాలతో మార్మోగాయి. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తూ, బీజేపీ కార్యాలయం ముందు ధర్నా ద్వారా తమ డిమాండ్లను తెలియజేయనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

# ‘హెచ్‌డీ హబ్ ’తోనే ఐబొమ్మ బిజినెస్!




**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

ఐబొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు రవి కేసు విచారణలో రోజుకో సంచలన విషయం వెలుగులోకి వస్తోంది. సైబర్ క్రైమ్ పోలీసుల విచారణలో రవి తన పైరసీ వ్యాపారానికి సంబంధించిన కీలక వివరాలను వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. కొత్త సినిమాల పైరసీ ప్రింట్లను టెలిగ్రామ్ ఛానళ్ల ద్వారా విక్రయిస్తూ అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారం చేసినట్లు అతడు ఒప్పుకున్నాడు. సాధారణ థియేటర్ ప్రింట్లకే పరిమితం కాకుండా, ఏకంగా క్యూబ్ నెట్‌వర్క్, శాటిలైట్ లింక్‌లను హ్యాక్ చేసి సినిమాలను హెచ్‌డీ ఫార్మాట్‌లో రికార్డు చేసినట్లు రవి తెలిపినట్టు సమాచారం. ఈ విధంగా పొందిన పైరసీ కంటెంట్‌ను విక్రయించేందుకు ‘హెచ్‌డీ హబ్’ పేరుతో ప్రత్యేక టెలిగ్రామ్ ఛానల్‌ను నిర్వహించినట్లు వెల్లడించాడు. ఆ ఛానల్‌లో పైరసీ లింకులు అప్‌లోడ్ చేసి, ఒక్కో లింక్‌కు 100 నుంచి 300 డాలర్ల వరకు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. ముఖ్యంగా ‘హిట్-3’, ‘కిష్కిందపురి’ వంటి తాజా సినిమాలను శాటిలైట్ లింక్ ద్వారా పైరసీ చేసినట్లు రవి అంగీకరించినట్టు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో మరెవరి పాత్ర ఉందన్న కోణంలోనూ విచారణ కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. పైరసీ ద్వారా వచ్చిన ఆదాయ మార్గాలు, లావాదేవీలపై సైతం ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మూడు వేర్వేరు కేసుల్లో విచారణ నిమిత్తం నాంపల్లి కోర్టు ఇమ్మడి రవికి 12 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు గురువారం సైబర్ క్రైమ్ పోలీసులు చంచల్‌గూడ జైలు నుంచి అతడిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. సినిమా పరిశ్రమను కుదిపేస్తున్న ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు.

# ఏపీ సీఎం చంద్రబాబుకు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు

ఇయర్’ పురస్కారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లభించడం రాష్ట్రానికి గర్వకారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. చంద్రబాబును ఒక దార్శనిక నేతగా పవన్ కల్యాణ్ అభివర్ణించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, ఐటీ, గ్రీన్ ఎనర్జీ రంగాలను ప్రోత్సహించడం, పాలనలో సంస్కరణలు తీసుకురావడంలో చంద్రబాబు చూపుతున్న దూరదృష్టి, కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వ్యాపార అనుకూల వాతావరణం సృష్టించడంలో ఆయన చేసిన ప్రయత్నాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ‘స్వర్ణాంధ్ర 2047’ లక్ష్య సాధనకు బలమైన పునాది వేస్తున్నాయని పవన్ కల్యాణ్ అన్నారు. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, సాంకేతిక పురోగతితో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు చంద్రబాబు చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు.రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో మరింత వేగంగా పయనించేందుకు చంద్రబాబు చేస్తున్న సేవలకు ఈ పురస్కారం మరింత శక్తిని చేకూర్చాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి మరిన్ని విజయాలు సాధించి, ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

# టీజీపీఎస్సీ గ్రూప్3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల

**హైదరాబాద్, వేద న్యూస్:**




తెలంగాణలో గ్రూప్3 ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది అభ్యర్థులకు టీజీపీఎస్సీ శుభవార్త తెలిపింది. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన గ్రూప్3 పరీక్షలకు సంబంధించిన ఎంపికైన అభ్యర్థుల జాబితాను గురువారం విడుదల చేసింది. 1,370 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులతో కూడిన ప్రొవిజినల్ నోటిఫికేషన్‌ను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు టీజీపీఎస్సీ ప్రకటించింది. ఇప్పటికే జనరల్ ర్యాంకింగ్, మెరిట్ జాబితాలను విడుదల చేసిన టీజీపీఎస్సీ, వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ అనంతరం సర్టిఫికెట్ల పరిశీలనను పూర్తిచేసింది. ఈ దశ అనంతరం తుది ఎంపికకు చేరిన అభ్యర్థుల జాబితాను తాజాగా ప్రకటించింది. విడుదల చేసిన జాబితాలో అభ్యర్థుల హాల్‌టికెట్ నంబర్లు, ఎంపికైన పోస్టు కోడ్, ప్రాంతాల వివరాలను పొందుపరిచారు. మొత్తంగా గ్రూప్3 కేటగిరీలో 1,388 పోస్టులు ఖాళీగా ఉండగా, ప్రస్తుతం 1,370 పోస్టులకు మాత్రమే అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదలైంది. మిగిలిన పోస్టులకు సంబంధించి తదుపరి ప్రక్రియను త్వరలో ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.67 లక్షల మంది అభ్యర్థులు హాజరైన విషయం తెలిసిందే. గ్రూప్3 ఎంపిక జాబితా విడుదలతో అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తదుపరి నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలను టీజీపీఎస్సీ త్వరలో వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఘనంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ,ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ ప్రో చైర్మన్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య , బాలలత అకాడమీ వ్యవస్థాపకురాలు, రెండు సార్లు సివిల్స్ విజేత) హాజరయ్యారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తమ నృత్యాలు, పాటలతో ఆలరించారు. పురాణాల్లో తల్లుల పాత్ర మొదలు చారిత్రాత్మక , నేటి సమాజంలోని తల్లుల పాత్ర వరకు పిల్లల పట్ల వారి బాధ్యత గురించి, పిల్లల ఎదుగుదలలో వారి పాత్ర గురించి ఆర్థవంతంగా నాటికలు,పాటలతో కూడిన నృత్యాలను ప్రదర్శించారు. సమాజంపై , పిల్లలపై తల్లిదండ్రుల ప్రభావం పై పలు రకాల స్కిట్లను డీపీఎస్ విద్యార్థులు ఎంతో చూడముచ్చటగా ప్రదర్శించి వీక్షకులతో పాటు అక్కడకి వచ్చిన అతిథులను ఆకట్టుకున్నారు. మల్క కొమరయ్య (ఎమ్మెల్సీ , డీపీఎస్ ప్రో చైర్మన్) మాట్లాడుతూ నాచారం డీపీఎస్ లో ఇంతటి మహోత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. వార్షికోత్సవ వేడుకలను ఇషానీ (స్పిరిట్ ఫ్ మదర్ హుడ్) పేరుతో నిర్వహించడం వెనక ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థులపై తల్లిదండ్రుల పాత్ర గురించి తెలియజేయడమే అని గుర్తు చేశారు. డీపీఎస్ లో విద్యను ప్రోత్సహిస్తూ క్రీడలను , సాంస్కృతిక కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నాము.ప్రతి ఒక్క విద్యార్థిని వారి యొక్క ఆసక్తిని బట్టి నైపుణ్యం ఉన్న ఆయా రంగంలో శిక్షణ ఇచ్చి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకోచ్చిన విద్యా విధానానికి అనుగుణంగా నేటి పోటీ ప్రపంచంలో సక్సెస్ సాధించేలా విద్యను అందిస్తున్నాము. ఇన్ని వేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, డీపీఎస్ బోధన , బోధనేతర సిబ్బంది హాజరై ఇషానీ వేడుకలను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు అని తెలియజేశారు. సీబీఐ జేడీ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ సోషల్ మీడియా యుగంలో తల్లిదండ్రులు పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి. బిగ్ బాస్, క్రైమ్స్ ,సోషల్ మీడియా లాంటి చెడు ప్రభావాన్ని చూపుతాయి, అందుకు వీటన్నింటికి పిల్లలను దూరంగా ఉంచాలని కోరారు. విద్యార్థి దశలోనే ఓ మంచి లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి. దానికి అనుగుణంగా నిరంతరం కష్టపడుతూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్కూళ్ల నుంచి పిల్లలు రాగానే స్మార్ట్ ఫోన్లకు, టీవీలకు అలవాటు పడకుండా చూసుకోవాలి, స్కూల్ విద్యను నేర్పితే తల్లిదండ్రులు సంస్కారం , బాధ్యతను నేర్పించాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులపై ఉందని గుర్తు చేస్తూ నరేంద్ర అనే వ్యక్తి గురించి మాట్లాడుతూ నరేంద్ర విద్యార్థి దశలో జట్కావాలాగా వైనం గురించి వివరించి పిల్లలు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగడంలో తల్లిదండ్రుల పాత్ర గురించి తెలియజేశారు. ఇంకా మాట్లాడుతూ గత ఏడాది ప్రయోగరాజ్ కు వెళ్లినప్పుడు గంగా యమునా సరస్వతి నదుల కలిసే చోట ప్రయోగరాజ్, ఈ రోజు నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ లో మరో ప్రయోగరాజ్ పేరెంట్స్ ఒకవైపు, విద్యార్థులు మరోవైపు, ఇంకోవైపు ఉన్న సరస్వతి టీచర్స్ రూపంలో చూస్తున్నాను, కొమరయ్యని డీపీఎస్ కోమరయ్య అని అంటాను ,కోమరయ్య అంటే డిస్పెన్, ప్యాషనెట్ ,సింపుల్ సిటీ .నిజమైన నాయకుడు,ఎమ్మెల్సీ ఇంతటి గొప్ప కార్యక్రమానికి పిలిచినందుకు కొమరయ్యకి డీపీఎస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు అని అన్నారు. ఈ వేడుకల్లో పల్లవి గ్రూప్స్ డైరెక్టర్ మల్క పల్లవి, డీపీఎస్ నాచారం ప్రిన్సిపల్ జ్యోతి, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఉద్రిక్తంగా మారిన కాంగ్రెస్ నిరసన

- బీజేపీ, హస్తం నేతల మధ్య ఘర్షణ
- కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

నేషనల్ హెరాల్డ్ కేసులో భారతీయ జనతా పార్టీ ఉద్దేశపూర్వకంగా ఎఐసిసి నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేరును చేర్చడాన్ని నిరసిస్తూ బీజేపీ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళన చేపట్టింది. వరంగల్ జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యాలయం ఎదుట వరంగల్ జిల్లా అధ్యక్షుడు అయుబ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన ఉధృతంగా మారింది. వెళ్లే దారి కార్యకర్తలతో నిండిపోవడంతో అటుగా వచ్చిన బీజేపీ నాయకుడు రాణా ప్రతాప్ రెడ్డి వాహనాన్ని అడ్డుకోవడంతో రెండు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఇరు వర్గాలను శాంతింప చేసిన పోలీసులు.. అనంతరం ధర్నా స్థలానికి చేరుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య నిసరన స్థలానికి చేరుకోవడంతో కార్యకర్తలు పెద్ద ఎత్తున బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ కార్యకర్తపై జరిగిన ఆందోళనను తెలుసుకున్న ఆ పార్టీ నాయకులు ఒక్కొక్కరిగా అక్కడికి చేరుకోవడన్నీ గమనించిన పోలీసులు జిల్లా అధ్యక్షుడు అయూబ్, ఎమ్మెల్యేలను, కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేసి గీసుకొండ పోలీస్ స్టేషన్ తరలించారు. బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే హెరాల్డ్ కేసులో సుప్రీంకోర్టు తప్పు పట్టిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను చేర్చడం అన్యాయమన్నారు ఈ కార్యక్రమంలో నల్లగొండ రమేష్, కొమరా రెడ్డి, బాబురావు, కార్పొరేటర్ గుండేటి నరేందర్, కార్పొరేటర్ బసవరాజు శ్రీమాన్, పిసిసి కార్యదర్శి సౌజన్య, మహిళా అధ్యక్షురాలు నాగపురి నారగోని స్వప్న, కరాట ప్రభాకర్, జన్ను రవి, వరంగల్ డివిజన్ అధ్యక్షుడు జన్ను వివేకు, కుసుమ సతీష్, సందీప్, కర్ణాకర్, బొబ్బిలి,సూచన రవీందర్, గోరంట్ల రాజు.,మాజీ కార్పొరేటర్ జన్ను రవి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ ప్రవీణ్, హుద్దూస్ ఆజం, 17వ డివిజన్ అధ్యక్షులు సంఘం, మండలం, గీసుకొండ మండల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండల అధ్యక్షులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.





# ఎమ్మెల్యేను కలిసిన కాట్నపల్లి సర్పంచ్

**వేద న్యూస్, సుల్తానాబాద్:**

కాట్నపల్లి గ్రామ నూతన సర్పంచ్‌గా ఎన్నికయిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓగుల పూజ రాజేందర్ గురువారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును కలిశారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో సర్పంచ్ పూజ రాజేందర్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో కలిసి చింతకుంటతో మాట్లాడారు. ఎమ్మెల్యే ఈ సందర్భంగా పూజ రాజేందర్ దంపతులను శాలువాతో సన్మానించారు. స్వీట్ తిని పించి సర్పంచ్‌గా ఎన్నికయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ పూజ రాజేందర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే విజ్జన్న సహకారంతో కాట్నపల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని, గ్రామాన్ని మండలంలో అగ్రగామిగా నిలుపుతామని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తామని తెలిపారు.





# ఈద్గాను అభివృద్ధి చేస్తాం

- సమస్యలన్నీ పరిష్కరిస్తాం
- మంత్రి కొండా సురేఖ
- ఈద్గా డెవెలప్మెంట్ కోసం కోటి మంజూరు
- పనులు ప్రారంభించిన మంత్రి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:** ఈద్గాలో నీరు నిలిచిపోవడం, సైడ్‌వాల్స్ కృంగిపోవడం, డ్రైనేజ్ వ్యవస్థ వంటి సమస్యల పరిష్కారానికి కోటి రూపాయలు మంజూరు చేశామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఖిలా వరంగల్ ఈద్గా అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన కోటి రూపాయల నిధులతో చేపట్టనున్న పనులను మంత్రి కొండా సురేఖ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. గతంలో ఎవరూ చేయని విధంగా ఈద్గాను సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఖబరస్తాన్ పరిసరాల్లో చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పండుగల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని తొలగించి శుభ్రత, సున్నం వేయడం వంటి పనులు చేపడుతున్నామని తెలిపారు. ముస్లిం పండుగల సందర్భంలో ప్రజలు నమాజ్ అనంతరం ఖబరస్తాన్‌కు వెళ్లి ప్రార్థనలు చేస్తారని, అలాంటి సందర్భాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం సహకరిస్తోందని మంత్రి చెప్పారు. ఈద్గా అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ జబ్బర్ మాట్లాడుతూ.. కోటి రూపాయలు మంజూరు చేయించినందుకు మంత్రి కొండ సురేఖకు, సీఎం, వరంగల్ మేయర్, కమిషనర్, కమిటీ సభ్యులకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, ఈద్గా మజీద్ కమిటీ సభ్యులు ఎంఏ జబ్బర్, ఎండి చాంద్ పాషా, ఎండి అల్లావుద్దీన్ సంజరి, మిర్జా హసన్ అలీ బెగ్, ఎండి మ్యాషూక్, ఎండి ముఖబీర్, యాకుబ్, మోయిన్, సాదిక్, అష్రాఫ్, సలీం, మహబూబ్ జానీ, షర్ఫుద్దీన్, రబ్బాని, అజ్జు, దస్తగీర్, ఇబ్రహీం, అంకుష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మేయర్ గుండు సుధారాణి, గ్రేటర్ వరంగల్ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఏఎస్పీ శుభం ప్రకాష్, డీఆర్ఓ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# పల్లె ప్రజల తీర్పే నిదర్శనం

- ప్రభుత్వ పనితీరుకు పట్టం కట్టారు
- మూడు విడతల్లోనూ కాంగ్రెస్ దే విజయం
- తెలంగాణ స్టేట్ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు ప్రజలిచ్చిన తీర్పే నిదర్శనమని, అఖండ విజయం కాంగ్రెస్ ప్రభంజనం కన్నుల ముందు కదలాడిందని బీసీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన వేద న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినాక జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఉప ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గుతుంటే, పల్లెలు కూడా అదే దారిలో నడుస్తూ కాంగ్రెస్ కు మరోసారి పల్లెలు పట్టం కట్టాయన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మూడో విడత కూడా కాంగ్రెస్ మద్దతుదారులకే ఓటర్లు మొగ్గు చూపడం కాంగ్రెస్ పాలనపై ప్రజలు వ్యక్తం చేసిన విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ గ్రామీణ రాజకీయాలలో స్పష్టమైన మార్పుకు ఇది సంకేతం అని తెలిపారు. రాష్ట్రంలో గత రెండు సంవత్సరాలుగా అమలవుతున్న ప్రజాపాలన సంక్షేమ అభివృద్ధి పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్న తీరు ఈ ఎన్నికల్లో స్పష్టమైందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ప్రజా పాలన ప్రభుత్వం ప్రజలలో బలమైన నమ్మకాన్ని కలిగించిందని చెప్పారు. గ్రామాల ప్రగతే లక్ష్యంగా ప్రజల భాగస్వామ్యంతో బలమైన గ్రామ పంచాయతీలను నిర్మించుకుందామని పిలుపునిచ్చారు.

# విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

- పిల్లల్లో సృజనాత్మకత వెలికితీసేందుకే..
- డీఈవో గిరిరాజ్ గౌడ్



**వేద న్యూస్, హనుమకొండ**

జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నేటి నుంచి రెండు రోజులపాటు జరగనుంది. హనుమకొండలోని సెయింట్ పీటర్స్ ఎడ్యూసెంటర్లో ఈ ప్రదర్శన కొనసాగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి వి గిరిరాజ్ గౌడ్ గురువారం తెలిపారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ ప్రదర్శన జరుగుతుందని, ఈసారి ప్రదర్శన సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, ఆరోగ్యం, వ్యవసాయం ఇతర అభివృద్ధి ఇతివృత్తాలపై దృష్టి సారిస్తుందని వివరించారు. ప్రాజెక్టులు వాస్తవికత శాస్త్రీయ విధానం ప్రదర్శన నైపుణ్యాల ఆధారంగా మూల్యాంకనం చేస్తారని తెలిపారు. ఇన్స్పైర్ కోసం 70, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు 170 మంది ఇప్పటికే నమోదు చేసుకున్నారని తెలిపారు. రెండు రోజుల్లో నాలుగు సెషన్లుగా మూడేసి మండలాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. బాల మేధావులను ప్రోత్సహించేందుకు కార్యక్రమానికి చేయూతనిచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కో కన్వీనర్ పి శ్రీనివాస స్వామి, ఎంఈవోలు నెహ్రూ నాయక్, మనోజ్ కుమార్, సిఎంఓ బద్దం సుదర్శన్ రెడ్డి, జిల్లా సార్వత్రిక విద్యా సమన్వయకులు అనగోని సధానందం గౌడ్, సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల అధినేత నర్రా నారాయణరెడ్డి, ప్రైవేట్ పాఠశాల యాజమాన్య సంఘం ప్రతినిధులు వెలగందుల ముక్తేశ్వర్, మాదాల సతీష, శ్రీకాంత్ రెడ్డి రాజేష్ కుమార, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ విజయం ప్రజా విశ్వాసానికి నిదర్శనం



- కార్యకర్తల కృషితోనే గెలుపు సాధ్యమైంది
- మున్ముందు ఇదే స్ఫూర్తి కొనసాగించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు సన్మానం

**వేద న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం:**

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాలు ప్రజల ఆశీర్వాదానికి, ఇందిరమ్మ పాలనపై ఉన్న నమ్మకానికి స్పష్టమైన నిదర్శనమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు కొత్తగూడెం నియోజకవర్గం చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పొంగులేటి మాటాడుతూ ఓ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 70 శాతానికి పైగా గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడంలో పార్టీ కార్యకర్తల అంకితభావం, కష్టపాటు కీలక పాత్ర అన్నారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ ఇదే విజయాలను పునరావృతం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని, ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రజాప్రతి నిధులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట ప్రసన్న, ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, ఆదినారాయణ, సీనియర్ నేత రాంరెడ్డి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఆదిత్య ఆస్పత్రిలో హెల్త్ చెకప్‌కి ఆఫర్

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్ ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈ నెల 31వరకు హెల్త్ చెకప్‌నకు బిగ్ ఆఫర్ ఇస్తున్నట్టు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఎలుక దేవేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇయర్ ఎండ్ ఫ్లాష్ సేల్‌లో భాగంగా డిసెంబర్ నెలలో ఈ మేరకు ధరల తగ్గింపు ఉంటుందని పేర్కొన్నారు. 'ఆరోగ్యం' ఎక్స్ విత్ యూటీఎస్‌హెచ్ కింద..రూ.7,599లో భాగంగా 139 పేరామీటర్స్(ఇద్దరు వ్యక్తులకు), 'ఆరోగ్యం' ఎక్స్‌ఎల్ విత్ యూటీఎస్‌హెచ్ కింద..రూ.8,999లో భాగంగా 149 పేరామీటర్స్(ఇద్దరు వ్యక్తులకు)ను వెల్లడించనున్నారు. ఈ టెస్టులలో లిపిడ్, లివర్, కిడ్నీ, థైరాయిడ్, డయాబెటిస్ ప్రొఫైల్స్, విటమిన్ ప్రొఫైల్, ఐరన్ డెఫిసీయన్సీ ప్రొఫైల్, సీ-రియాక్టివ్ ప్రొటీన్ ఉంటాయి. ఈ ఆఫర్ ఈ నెల 31 వరకు మాత్రమే ఉంటుందని, జమ్మికుంట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని పూర్తి వివరాలకు ఆదిత్య మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని సంప్రదించొచ్చు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అతిపెద్ద స్కామ్

- పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర
- ప్రజా ఉద్యమంగా పోరాటం కొనసాగుతుంది
- వైఎస్ఆర్సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి
- పీపీపీ విధానానికి వ్యతిరేకంగా గవర్నర్‌కు కోటి సంతకాల సమర్పణ

**వేద న్యూస్, అమరావతి ప్రతినిధి:**

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడం దేశ చరిత్రలోనే అతిపెద్ద స్కామ్ అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానాన్ని వ్యతిరేకిస్తూ సేకరించిన కోటి సంతకాల ప్రతులను గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు సమర్పించినట్లు ఆయన తెలిపారు. గవర్నర్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన వైఎస్ జగన్, చంద్రబాబు ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తూ, రైతులను మోసం చేస్తూ, ఇప్పుడు పేదల వైద్య విద్యను కూడా దూరం చేయాలన్న ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఒక్కో మెడికల్ కాలేజీకి ఏటా రూ.120 కోట్ల మేర జీతాలను ప్రభుత్వమే చెల్లిస్తూ, నిర్వహణను మాత్రం ప్రైవేటు చేతుల్లో పెట్టడం భారీ కుంభకోణమని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ ప్రైవేటీకరణ విధానం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందని వైఎస్ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఉద్దేశమే సామాన్యులకు నాణ్యమైన వైద్య విద్య అందించడమని, అలాంటి వ్యవస్థను నిర్వీర్యం చేయడం ప్రజా వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. ఇదే సందర్భంలో తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్సీపీ ముఖ్య నేతలతో సమావేశమైన వైఎస్ జగన్, కేవలం రెండు నెలల్లో కోటి నాలుగు లక్షలకు పైగా సంతకాలు సేకరించడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇది పూర్తిగా ప్రజల నుంచి పుట్టిన ఉద్యమమని, పార్టీ శ్రేణుల కృషితో ప్రజా ఉద్యమంగా



మారిందని అభినందించారు. సుమారు 40 మంది పార్టీ నాయకులతో కలిసి గవర్నర్‌ను కలిసినట్లు తెలిపారు. పేదల హక్కులను కాపాడే వరకు ఈ పోరాటం ఆగదని వైఎస్సార్సీపీ స్పష్టం చేసింది.

# శాయంపేట మండలంలో కాంగ్రెస్ హవా

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలో కాంగ్రెస్ అభ్యర్థుల హవా కొనసాగింది. మండలంలో 33,557 ఓట్లు ఉండగా, 28 436 పోలింగ్ నమోదయిందని మండల ఎన్నికల అధికారి తెలిపారు. శాయంపేట మండలంలో పోలింగ్ శాతం 84.74% పోలింగ్ నమోదు అయిందని ఎన్నికల అధికారి తెలిపారు.

**శాయంపేట మండలంలో గెలుపొందిన అభ్యర్థులు వీరే..**

అప్పయ్య పల్లి - కౌడగానే సుప్రియ, బిఆర్ఎస్, ఆరేపల్లి–దుర్నాల రమ, కాంగ్రెస్, నర్సింహులపల్లి–గోనె రాజు బి, ఆర్ఎస్, రాజుపల్లి - మాల్సాని లక్ష్మణరావు, కాంగ్రెస్, నూర్జహాన్ పల్లి - అల్లే రాజీరు, కాంగ్రెస్, జోగంపల్లి - మారబోయిన ప్రభాకర్, కాంగ్రెస్, గంగిరేనిగూడెం –కత్తుల కుమారస్వామి, కాంగ్రెస్, గట్లకానిపర్తి వైనాల విజయ, కాంగ్రెస్, కాట్రపల్లి - సదర్ లాల్, కాంగ్రెస్, సాదనపల్లి - మిట్టపల్లి సతీష్, కాంగ్రెస్, సూర్యనాయక్ తండ - లావుడ్య రమ, బీఅర్ఎస్, కొత్తగట్టుసింగారం - శివాజీ, కాంగ్రెస్, ప్రగతి సింగారం - మాదరపు సరోజన, కాంగ్రెస్, మైలారం నునె దివ్య, బిజెపి, వసంతాపూర్ - హింగే భాస్కర్, కాంగ్రెస్, నేరేడుపల్లె - మడికొండ ఇందిర, కాంగ్రెస్, గోవిందాపూర్ - కట్టెల స్వాతి బీ ఆర్ఎస్, హుస్సేన్ పల్లి - ఎడ్ల స్వరూప, కాంగ్రెస్, శాయంపేట - చింతల ఉమా, కాంగ్రెస్ రెబల్, పత్తిపాక - గజ్జి ఐలయ్య, కాంగ్రెస్ రెబల్, కొప్పుల - మామిడి అశోక్, బిఆర్ఎస్, తారాపూర్ - కుక్కల సరోజన, కాంగ్రెస్ రెబల్, పెద్దకొడపాక - మంద దీన, కాంగ్రెస్, సురంపేట - శశి పాల్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు.

# శ్రేయస్ అయ్యర్‌ను పక్కన పెట్టి రాహుల్‌కే ప్రాధాన్యతా?

**వేద న్యూస్ డెస్క్:**



టీమ్ ఇండియా సెలెక్టర్ల నిర్ణయాలపై ఇప్పుడు కేవలం అభిమానులే కాదు, ఐపీఎల్ ఫ్రాంచైజీ యజమానులు కూడా బహిరంగంగానే అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహులలకు ఇస్తున్న ప్రాధాన్యత విషయంలో తీవ్ర చర్చ మొదలైంది. ఐపీఎల్ 2026కు ముందు ఓ ప్రముఖ ఐపీఎల్ జట్టు యజమాని, "శ్రేయస్ అయ్యర్ కంటే కేఎల్ రాహుల్ ఎందుకు ఎక్కువ ప్రాధాన్యం పొందుతున్నాడు? ఒక్క కారణమైనా చెప్పండి" అంటూ సెలెక్టర్లను నేరుగా ప్రశ్నించినట్లు సమాచారం. గత సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఛాంపియన్‌గా నిలిపిన శ్రేయస్ అయ్యర్, కెప్టెన్‌గా తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నాడు. అంతేకాదు, బ్యాట్స్‌మన్‌గా కూడా కీలక మ్యాచ్‌లలో జట్టును ముందుండి నడిపించాడు. ఇలాంటి ఆటగాడిని బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితా నుంచి తొలగించడం, అలాగే పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో నిరంతర అవకాశాలు ఇవ్వకపోవడం పట్ల ఫ్రాంచైజీలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు కేఎల్ రాహుల్ ఫామ్, స్ట్రైక్ రేట్ అంశాలు కొంతకాలంగా విమర్శలకు లోనవుతున్నా, అతడికి మాత్రం జట్టులో అవకాశాలు కొనసాగుతున్నాయని చేస్తున్నారు. "ఎంపికకు ఏ ప్రాతిపదిక ఉపయోగి స్తున్నారు? అదే ప్రమాణాలు శ్రేయస్‌కు ఎందుకు వర్తించడంలేదు?" అన్నదే వారి ప్రధాన ప్రశ్నగా వినిపిస్తోంది. ఐపీఎల్ వేలాల్లో భారత జట్టులో ఉన్న ఆటగాళ్లకు సహజంగానే ఎక్కువ డిమాండ్ ఉంటుంది. అయితే సెలెక్టర్లు ఒక ఆటగాడిని పక్కన పెడితే, అతడి మార్కెట్ విలువపై ప్రభావం పడుతుందని ఫ్రాంచైజీలు భావిస్తున్నాయి. శ్రేయస్ అయ్యర్ లాంటి నిరూపిత కెప్టెన్, మ్యాచ్ విన్నర్‌ను నిర్లక్ష్యం చేయడం వల్ల వేలంలో తమ వ్యూహాలు దెబ్బతింటున్నాయని యజమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సెలెక్టర్లు ఒకరిని ఫేవరెట్‌గా చూస్తూ, మరొకరిని కావాలనే పక్కన పెడుతున్నారా అనే సందేహాలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తున్నాయి. శ్రేయస్ అయ్యర్‌కు దక్కాల్సిన గౌరవం, అవకాశాలపై ఐపీఎల్ యజమానులు బహిరంగంగా గొంతు ఎత్తడం ప్రస్తుత క్రికెట్ రాజకీయాలకు కొత్త మలుపుగా మారింది. రాబోయే సిరీస్‌లు, ఐపీఎల్ 2026 వేలంలో ఈ వివాదం ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాల్సి ఉంది.

# కేకేఆర్‌తో బాద్‌షా సూపర్ సంపాదన..

## - ఒక్కో ఐపీఎల్ సీజన్‌కు కోట్ల వర్షమే!

**వేద న్యూస్ డెస్క్:**



భారతదేశంలో క్రికెట్ అంటే కేవలం ఆట మాత్రమే కాదు, అది వేల కోట్ల వ్యాపారం. ఈ వ్యాపారంలో అత్యంత తెలివిగా పెట్టుబడి పెట్టి భారీ లాభాలు అందుకుంటున్నవారిలో బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ ముందు వరుసలో ఉన్నాడు. సినిమాల్లో హిట్లు, ఫ్లాపులు ఎలా ఉన్నా.. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ యజమానిగా ఆయన సంపాదన చూస్తే ఎవరికైనా మైండ్ బ్లాక్ కావాల్సిందే. కేకేఆర్‌కు వచ్చే ఆదాయం ప్రధానంగా బీసీసీఐ రెవెన్యూ షేర్, మీడియా హక్కులు, సెంట్రల్ స్పాన్సర్‌షిప్‌లు, జట్టు జెర్సీపై ఉన్న బ్రాండ్ ఒప్పందాలు, టికెట్ అమ్మకాలు, ప్రైజ్ మనీ ద్వారా వస్తోంది. ఒక్కో ఐపీఎల్ సీజన్‌లో కేకేఆర్‌కు సుమారు రూ.250 నుంచి రూ.270 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనాలు చెబుతున్నాయి. ఇందులో ఆటగాళ్ల జీతాలు, జట్టు నిర్వహణ, ప్రయాణాలు వంటి ఖర్చులకు దాదాపు రూ.100 కోట్లు ఖర్చవుతాయి. అన్ని ఖర్చులు పోను చూస్తే, ఒక్కో సీజన్‌కు కేకేఆర్‌కు రూ.150 నుంచి రూ.170 కోట్ల వరకు నికర లాభం వస్తుందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇందులో షారూఖ్ ఖాన్‌కు ఉన్న వాటా సుమారు 55 శాతం. ఈ లెక్కన కేవలం ఐపీఎల్ ద్వారా మాత్రమే ఆయనకు ఏడాదికి సుమారు రూ.80 కోట్ల వరకు వ్యక్తిగత లాభం వస్తోందని అంచనా. ఐపీఎల్ విలువ పెరుగుతున్న కొద్దీ కేకేఆర్ జట్టు బ్రాండ్ విలువ కూడా భారీగా పెరిగింది. హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025 ప్రకారం షారూఖ్ ఖాన్ నికర ఆస్తి విలువ సుమారు రూ.12,490 కోట్లు. గత ఏడాదిలోనే ఆయన ఆస్తి సుమారు రూ.5,000 కోట్ల వరకు పెరగడం గమనార్హం. ఇందులో కేకేఆర్ సాధించిన విజయాలు, ముఖ్యంగా 2024 ఐపీఎల్ టైటిల్ కీలక పాత్ర పోషించాయి. ఐపీఎల్ 2026 కోసం కూడా కేకేఆర్ భారీ ప్లానింగ్‌తో ముందుకెళ్తోంది. కామెరూన్ గ్రీన్‌ను రూ.25.20 కోట్లకు కొనుగోలు చేయడం వంటి నిర్ణయాలు జట్టును మరింత బలోపేతం చేశాయి. జట్టు విజయవంతమైతే, బాద్‌షా క్రికెట్ రంగంలో సంపాదించే లాభాలు సినిమాల బాక్సాఫీస్ రికార్డులను మించి పోవడం ఖాయమనే మాట వినిపిస్తోంది.

# కాంతార విలన్ రోల్‌పై రుక్మిణి వసంత్ ఓపెన్ కామెంట్స్



**వేద న్యూస్ డెస్ :**

రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా ప్రాజెక్ట్ కాంతార చాప్టర్ 1 సినిమాతో కాంతార బ్యూటీగా గుర్తింపు తెచ్చుకున్న రుక్మిణి వసంత్ తాజాగా తన విలన్ పాత్రపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రీక్వెల్‌లో ఎవరూ ఊహించని విధంగా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించడం తన కెరీర్‌లోనే చాలా ప్రమాదకరమైన నిర్ణయమని ఆమె వెల్లడించింది. తాజా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కెరీర్ తొలి దశలోనే విలన్ పాత్ర చేయడం తనను కొంత భయపెట్టిందని రుక్మిణి చెప్పింది. ఈ రోల్ చేసిన తర్వాత మిగతా జీవితమంతా నెగెటివ్ పాత్రలకే పరిమితమవుతానేమోనని అప్పట్లో అనిపించిందని తెలిపింది. అయితే ప్రేక్షకులు తన పాత్రను ద్వేషించకుండా, అంగీకరించి మెచ్చుకోవడం తనకు పెద్ద ఊరట ఇచ్చిందని చెప్పుకొచ్చింది. సినిమా ఫలితం గురించి ఎక్కువగా భయపడాల్సిన అవసరం లేదని అప్పుడే అర్థమైందని ఆమె పేర్కొంది. కాంతార చాప్టర్ 1 సినిమా గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.800 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, 2025లో అత్యధిక గ్రాస్ చేసిన భారతీయ సినిమాల్లో ఒకటిగా నిలిచింది. ఈ విజయంలో తన పాత్రకూ ప్రత్యేక గుర్తింపు దక్కడం గర్వంగా ఉందని రుక్మిణి తెలిపింది. ఈ రోల్ తన కెరీర్‌ను కొత్త దిశలో మలిచిందని, నటిగా తనపై తనకే నమ్మకం పెంచిందని చెప్పింది. ప్రస్తుతం ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక రుక్మిణి వసంత్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉంది. కేజీఎఫ్ స్టార్ యశ్ నటిస్తున్న టాక్సిక్, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో గ్లోబల్ స్టార్ ఎన్టీఆర్ నటిస్తున్న డ్రాగన్ చిత్రాల్లో ఆమె కీలక పాత్రల్లో కనిపించనుంది. పాన్ ఇండియా స్థాయి సినిమాలు కావడంతో ఈ ప్రాజెక్టులపై అంచనాలు భారీగా నెలకొన్నాయి.

# ప్రభాస్‌కు న్యూ ఇయర్ బ్రేక్ రద్దు..

## - స్పిరిట్ కోసం టైట్ షెడ్యూల్ ఫిక్స్ చేసిన సందీప్ వంగా

**వేద న్యూస్ డెస్క్:**

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'స్పిరిట్' షూటింగ్ షెడ్యూల్‌లో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. తొలుత డిసెంబర్ చివరి వరకూ షూటింగ్ పూర్తి చేసి ప్రభాస్‌కు న్యూ ఇయర్ బ్రేక్ ఇవ్వాలని వంగా భావించినప్పటికీ, ఇప్పుడు ఆ ప్లాన్‌ను పూర్తిగా మార్చినట్లు ఇండస్ట్రీలో బలమైన టాక్ వినిపిస్తోంది. 'స్పిరిట్' సినిమాను మొదట అనుకున్నట్టుగా డిసెంబర్ 2027కి కాకుండా, 2027 మధ్యలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని వంగా నిర్ణయించుకున్నారని సమాచారం. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి న్యూ ఇయర్ బ్రేక్‌ను పూర్తిగా రద్దు చేసి, షూటింగ్‌ను నిరంతరంగా కొనసాగించాలని టీమ్ ఫిక్స్ అయినట్టు తెలుస్తోంది. ఈ సినిమా షూటింగ్ నవంబర్ 27న హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ప్రస్తుతం జరుగుతున్న తొలి షెడ్యూల్ జనవరి తొలి వారం వరకూ సాగనుందని సమాచారం. ఆ తర్వాత స్వల్ప విరామం తీసుకుని వెంటనే తదుపరి షెడ్యూల్ మొదలుపెట్టేలా ప్లానింగ్ చేస్తున్నారట. "ఈసారి న్యూ ఇయర్ బ్రేక్ లేదు" అంటూ వంగా టీమ్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రభాస్‌తో సందీప్ రెడ్డి వంగా చేస్తున్న తొలి సినిమా కావడంతో 'స్పిరిట్'ను ఆయన చాలా ప్రత్యేకంగా చూస్తున్నారని అంటున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడని ఇప్పటికే క్లారిటీ వచ్చింది. యాక్షన్‌తో పాటు గట్టిగా ప్యాక్ చేసిన డ్రామా ఈ సినిమాకు ప్రధాన బలంగా ఉండనుందని సమాచారం. అలాగే ఈ సినిమాతో వంగా వివేక్ ఒబెరాయ్ కాంబినేషన్ కూడా తొలిసారి తెరపైకి రానుంది. విలన్ పాత్రలో నటిస్తున్న వివేక్



ఒబెరాయ్ కోసం వంగా ప్రత్యేకమైన లుక్ డిజైన్ చేసినట్టు టాక్. గతంలో 'యానిమల్' సినిమాలో బాబీ డియోల్‌ను పూర్తిగా కొత్తగా చూపించినట్టే, 'స్పిరిట్'లో కూడా వివేక్ ఒబెరాయ్‌ను ఊహించని అవతారంలో చూపించబోతున్నారని చిత్రబృందానికి దగ్గరగా ఉన్న వర్గాలు వెల్లడిస్తున్నాయి. మొత్తానికి అనుకున్నదానికంటే వేగంగా షూటింగ్ పూర్తి చేసి సినిమాను త్వరగా విడుదల చేయాలనే పట్టుదలతోనే సందీప్ రెడ్డి వంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రభాస్ అభిమానుల్లో ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. వంగా స్టైల్ రా యాక్షన్‌కు ప్రభాస్ పవర్ కలిస్తే, 'స్పిరిట్' నిజంగా ఒక స్పెషల్ మూవీగా నిలిచే అవకాశం ఉందన్న నమ్మకం సినీ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

# 'కన్నెపిట్టరో కన్నుకొట్టరో'.. అదిరిపోయిన అడివి శేష్ 'డెకాయిట్' టీజర్

**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ నటుడు అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'డెకాయిట్' నుంచి విడుదలైన టీజర్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. "ఒక ప్రేమ కథ" అనే ఉపశీర్షికతో తెరకెక్కుతున్న ఈ సినిమాతో షానీల్ డియో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ క్రమంలో తాజాగా విడుదలైన టీజర్ ఆ అంచనాలను మరో లెవెల్‌కు తీసుకెళ్లింది సాగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆ తర్వాత ఫుల్ యాక్షన్, ఇంటెన్స్ డ్రామాతో టీజర్ దూసుకెళ్లింది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ఇద్దరూ దొంగల పాత్రల్లో కనిపించబోతున్నారని టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. స్టైలిష్ యాక్షన్ సీన్స్, ఎమోషనల్ టచ్ ఉన్న విజువల్స్ సినిమాకు ప్రధాన హైలైట్‌గా కనిపిస్తున్నాయి. శేష్ డిఫరెంట్ షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో మెప్పించనున్నాడనే సంకేతాలు టీజర్‌లో స్పష్టంగా కనిపించాయి. మార్చి 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు




చిత్రబృందం ప్రకటించింది. టీజర్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండటంతో, అడివి శేష్ అభిమానులతో పాటు సినిమా లవర్స్‌లోనూ ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073